## కథ

# మీనాక్షి vs రాజ్యలక్ష్మి

**భీమరాజు వెంకటరమణ**

ఫ్లాట్ నెంబరు నూట ఏడులో ఉండే రాజ్యలక్ష్మి ఇంకా పాలవాడు రాలేదేమిటీ అని ప్రొద్దున్నే తలుపు తీసి చూసిందోలేదో ఎవరో తలదువ్వుకొని ఉండ చుట్టి వదిలేసిన జుట్టు ఆమె ముఖం మీదపడి కాసేపు ముక్కు పైభాగంలో అతుక్కుంది. అంతే! వెంటనే ఎదుటి ఫ్లాట్ తలుపు దబాదబామని బాదింది ఆవేశంగా.

ఆ ఇంటి ఇల్లాలు మీనాక్షి తలుపు తీయగానే ''ఇదేమిటి?'' అని అడిగింది. ''అది తెలుసుకోవడానికా తలుపు అంత గట్టిగా కొట్టావ్? దాన్ని జుట్టు అంటారు'' అన్నది.

''అది తెలుసు, దీన్ని మా ఇంటి ముందు ఎందుకేసావ్ అని అడుగుతున్నా'' అంది రాజ్యలక్ష్మి.

''ఏవమ్మోయ్! ప్రొద్దుటే ఏమిటీ న్యూసెన్స్! అది నా జుట్టే అని ఏమిటి నమ్మకం?'' అడిగింది మీనాక్షి.


''ఏమిటా? ఇటు చూడు ఈ నీలం రంగు, ఇలాంటి రంగులు నువ్వు కాక ఇంకెవరేసుకుంటారు ఈ ఫ్లాట్లలో?''

మీనాక్షి కోపం తారాస్థాయికి చేరుకుంది. ''అంటే టీవీలో ప్రకటనలు చూసి రకరకాల రంగులు వేసుకుంటానానేగా నీ ఎగతాళి? నా యిష్టం! నీలం రంగు కాకపోతే పసుపు రంగు వేసుకుంటా, అడగటానికి నువ్వెవరు? నేను వేస్తుండగా మీ ఇంట్లో పడితే అప్పుడు అడుగు, అంతేగాని అనవసరంగా నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదు''

అంతలో అటు మీనాక్షి భర్త ఈశ్వరరావు ఇటు రాజ్యలక్ష్మి భర్త రామారావు నిద్రలేచి ''అప్పుడే గంట ఆరు అయిందే!'' అనుకుంటూ చిన్నగా బాత్‌రూం వైపు నడిచారు భార్యల గొడవ మొదలైతే ఉదయం ఆరు అయినట్లు వాళ్ళ లెక్క.

గృహిణులు ఇరువురూ వాళ్ళ వాకిళ్ల ముందు ముగ్గులు వేయడానికి ఉపక్రమించారు. రాజ్యలక్ష్మి మొదలు పెట్టింది. ''కాస్త చిన్న ముగ్గు వెయ్యవమ్మా! ఎదురుగా మాదొక వాకిలి ఉంది మేమూ ముగ్గు వేసుకోవాలి కదా?'' అంటూ ప్రక్కనే ఉన్న నూట ఎనిమిది ఫ్లాట్ కమలాకర్ సంచీతో బజారు బయలుదేరడం చూసి ''చూడండి అన్నయ్యగారు! ఈమె ముగ్గులకి ఎంత చోటూ సరిపోవడంలేదు, మీరైనా చెప్పండి'' అన్నది.

వెంటనే అతను ''తల్లుల్లారా! నన్ను ఈ ముగ్గులోకి లాగకండి! పోయిన సంక్రాంతికి మీ ఇద్దరికీ భయపడి మీరు వేసిన ముగ్గులు తొక్కకుండా వెళ్ళాలని లాంగ్‌జంప్ చేసి జారిపడి నడుము విరిగి నెలరోజులు మంచంమీద ఉన్నాను. మీరిద్దరు గొడపడుతుంటారు మళ్ళీ కలిసి సినిమాలకు షికార్లకు తిరుగుతుంటారు. మధ్యలో కలుగజేసుకున్న వాడే వెర్రి వెంగళప్ప'' అంటూ సంచీ ఊపుకుంటూ వెళ్ళాడు.



అంతలో పని మనిషి రేఖ రాజ్యలక్ష్మి ఇంట్లోకి వెళుతుంటే ఆమెను ఆపి మీనాక్షి ''ఆగవే రేఖా! ఎక్కడికి అటు వెళుతున్నావ్! మాకు ఇవాళ అర్జంటు అని చెప్పలేదు? మా పని పూర్తి చేసి ఇంకెక్కడికైనా వెళ్ళు'' అన్నది. వెంటనే రాజ్యలక్ష్మి పనిమనిషి చెయ్యి పట్టుకొని ''నాలుగు వందలు పోసి నిన్ను పెట్టుకున్నది నీ ఇష్టం వచ్చినప్పుడు పని చెయ్యడానికి కాదు, లోపలికి వెళ్ళి పనిచేస్తావా? మానేస్తావా?'' అన్నది.

''అమ్మగారూ! నిన్న మీరు అన్నం పెట్టి ఇచ్చిన గిన్నెకింద మర్చిపోయా, తీసుకొని వాస్తా'' అని పరుగు తీసింది రేఖ.

''అబ్బబ్బ! వాకిట్లోకి రావాలంటేనే చిరాకుపుడుతున్నది. మెయిన్ డోర్‌కి మేకులు కొట్టి బాల్కనీలోంచి దారి పెట్టుకుంటే బావుంటుందేమో!'' అన్నది మీనాక్షి.

రాజ్యలక్ష్మిని రెచ్చగొట్టినట్లయింది. ''ఆ పని మీరు కాదు మేము చెయ్యాలి, మొన్నటికి మొన్న ఎవరో మీసాలవాడు మధ్యాహ్నం మంచి నిద్రలో ఉండగా వచ్చి తలుపుకొట్టాడు, చేతబడి చేసేవాడిలా ఉన్నాడు. నూట ఏడుకి నూట తొమ్మిదికి తేడా తెలియదా వాడికి?'' అన్నది ముఖం చిట్లిస్తూ.

మీనాక్షి వెంటనే అందుకుంది ''ఏవమ్మోయ్! వాడు వీడు అంటున్నావ్, అతను ఎవరనుకున్నావ్? మా బాబాయి కొడుకు, కరీంనగర్లో గొప్ప పలుకుబడి గల వ్యక్తి, అతనితో పెట్టుకుంటే వాళ్ళ ఊరు జనం మొత్తం దండయాత్రకి వాస్తారు జాగ్రత్త. ఆ మాటకొస్తే నాలుగు రోజుల క్రితం ఒక పంచకట్టు మనిషి వచ్చి తలుపుకొడితే ఎవరో చీరలమ్మేవాడనుకున్నా మా రాజ్యం ఎక్కడికెళ్ళింది? అనడిగాడు ఇకిలించుకుంటూ, ముఖం మీద తలుపేసా, తిక్క కుదిరింది'' అన్నది.

''ఆయన ఎవరో తెలుసా? మా కడప బాబాయ్, ఆయనకు కోపం వస్తే చేతి బాంబులు నాలుగు చేబదులు తెచ్చి మీ ఇంట్లో పడేసినా ఆశ్చర్యంలేదు'' అన్నది రాజ్యలక్ష్మి కోపం, వ్యంగ్యం కలిపిన స్వరంతో.

ప్రస్తుతానికి అలసట వచ్చినట్లుంది ఇద్దరు ఒక్కసా

రిగా తలుపులువేసుకొని లోపలికి వెళ్ళారు.

తొట్టెడు నీరు తోడి బండెడు బట్టలు ఉతికినంత ఆయాసంతో రాజ్యలక్ష్మి సోఫాలో కూలబడి, ''ఒరేయ్ చందూ! కాస్త ఫ్యాన్ స్పీడు పెంచు'' అన్నది చీర కొంగుతో ముఖం తుడుచుకుంటూ. భర్త రామారావు రావడం చూసి ''అయినా నేను అంతగా మొత్తుకుంటుంటే కనీసం సాయం రారేమిటండీ? పొద్దునలేస్తే ఆమెగారి చూపు మన వాకిలివైపే, తలుపుకు పెచ్చులు కూడా ఊడుతున్నాయి'' అన్నది.

రామారావు నవ్వుతూ ''తలుపులు పెచ్చులు ఊడటం ఆమె చూపులకు కాదులేవే! మనం తలుపులకు రంగులువేసి రెండు సంవత్సరాలయింది. ఇదుగో మన చందు పెళ్ళికి దాన్ని కొత్తదిగా చేద్దాంలే, ఇకపోతే మీ గొడవ విషయానికొస్తే, అది ఆడవాళ్ల వ్యవహారం, పోనీ ఈశ్వరరావు రంగంలోకి వస్తే నేనూ జోడీ కట్టవచ్చు. నన్ను తక్కువగా అంచనా వెయ్యకు రాజ్యం, మీది కడప అయితే మాది ఒంగోలు, తెలుసుగా! మా ఊరు పోట్ల గిత్తలకు పేరు'' అన్నాడు.

అంతలో చందు ''నాకు కాలేజీకి టైం అయిందమ్మా! వెళ్తొస్తా!'' అంటూ బయటకు వెళ్ళాడు.

''నేనూ ఆఫీస్‌కి వెళ్ళాలి, త్వరగా తయారవ్వాలి'' అంటూ లోపలికి వెళ్ళాడు రామారావు.

సాయంత్రం ఆరు గంటలు, వాతావరణం ప్రశాంతంగా ఉంది. మీనాక్షి తలుపు తెరిచింది, కానీ ఎదుటి తలుపు ఇంకా మూసే ఉంది.

ఇంతలో ఫెళ్ళుమని రాజ్యలక్ష్మి తలుపు తీసింది. వెంటనే ఆమెతో ''ఏవమ్మా! ఇందాకటి నుంచి చూస్తున్నా, ఏమిటి ఆ గోల? మీకు ఎంత భక్తి ఉంటే మాత్రం అంత సౌండుతో పాటలు పెట్టాలా? భక్తి పాటలకు ఒక వేళా పాళా లేదా?'' చేతులూపుతూ అడిగింది మీనాక్షి.

రాజ్యలక్ష్మి పొజిషన్‌లోకి వచ్చేసింది. ''మీరు మాత్రం తక్కువా? ప్రతి శని, ఆది వారాలు సెలవలు వస్తే కాస్తయినా విశ్రాంతి తీసుకోనీయకుండా నాలుగేసి అయిదేసి గంటలు పాడిందే పాడి మా మెదళ్ళు తినటం లేదూ?'' కడిగేసింది.

మీనాక్షి కళ్ళల్లో కసి నిండిపోయింది ''మా స్వాతికి సంగీతం నేర్పుతుంటే అది మీకు పరిహాసంగా ఉన్నదా? సంగీత జ్ఞానం కూడా లేని మనుషుల మధ్య ఉండకూడదు, మా అమ్మాయికి కాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగం వచ్చింది. త్వరలో హైటెక్ సిటీ దగ్గరకు షిఫ్ట్ అయిపోతాం, అపుడు గాని మనసుకు శాంతి కలుగదు'' అన్నది.

వెంటనే రాజ్యలక్ష్మి ''మా చందూకు ఎప్పుడో ఇచ్చారు అప్పాయింట్మెంట్ ఆర్డర్, వచ్చే నెలతో కాలేజీ అయిపోగానే మేమూ వెళతాం హైటెక్కు సిటీ'' అన్నది కాస్త నొక్కి పలుకుతూ.

★ ★ ★

సమయం ఉదయం ఆరు గంటలు. రామారావు చెవులు మేలుకొలుపుకోసం ఎదురు చూస్తున్నాయి. కానీ ఈ రోజు వ్యత్యాసంగా 'వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్? నాట్ మీ యూ ఆర్ ది పర్సన్ మేకింగ్ ఆల్ ది నాన్సెన్స్, హోల్డ్ యువర్ టంగ్- బెటర్ యూ డూ ఇట్ ఫస్ట్' లాంటివి వినపడుతున్నాయి.

రామారావు ఉలిక్కిపడి ''చందూ! ఇలారా ఏమిటి? ఎవరక్కడ మాట్లాడేది?'' అడిగాడు.


''అమ్మ, మీనాక్షి ఆంటీ మాట్లాడుకుంటున్నారు నాన్నా! రాత్రి అమ్మ అన్నదిలే ఒరేయ్ చందు! ఈమధ్య నాకు ఇంగ్లీషులో కమ్యూనికేషన్ స్కిల్స్ బాగా తగ్గినట్లుందిరా! ప్రాక్టీస్ చెయ్యాలి' అని, బహుశా దాని ప్రభావం కావచ్చు'' అన్నాడు.

ఇటు రామారావు అటు ఈశ్వరరావు భార్యల ప్రక్కన నిలబడి కాసేపు వాళ్ళ సంభాషణ ఆస్వాదించి వెళ్లారు. ఇంతలో వాచ్‌మెన్ వచ్చి ''అమ్మగారు! సాయంత్రం ఏడు గంటలకు అసోసియేషన్ మీటింగ్, అందరినీ రమ్మన్నారు. ముఖ్యంగా మీ ఇద్దరినీ తప్పక రమ్మని చెప్పారు సెక్రటరీగారు'' అని చెరొక పేపర్ ఇచ్చి వెళ్ళాడు.

సాయంత్రం ఏడు గంటలకు అన్ని ఫ్లాట్స్ వాళ్ళు కొలువు తీరారు. మీనాక్షి రాజ్యలక్ష్మి ఎదురెదురుగా కూర్చున్నారు ఏమాత్రం అవకాశం దొరికినా ఈ వేదికను వాడుకోవాలని. రామారావు ఈశ్వరరావు ప్రక్కప్రక్కనే కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

సెక్రటరీ బాబూరావు మాట్లాడటానికి లేచారు. అసలు ఈ మీటింగ్ పెట్టిందే మీనాక్షి రాజ్యలక్ష్మిల కోసం, ముఖ్యంగా ముగ్గుల గొడవ గురించి, అదీ రేపు సంక్రాంతి కావడంవల్ల. కానీ వాళ్ళ కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం సెక్రటరీగారికి లేదు, విషయం ఎలా మొదలుపెట్టాలో తెలియక ఇలా మాట్లాడుతున్నాడు. ''అందరికీ స్వాగతం! మనం ఎంతో కాలంగా ఈ ఫ్లాట్స్‌లో కలిసిమెలిసి ఉంటున్నాము, మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల వారేకాక ఇతర రాష్ట్రాల వాళ్ళు కూడా ఇక్కడ ఉన్నారు. ఒక చిన్న భారతదేశంలా భిన్నత్వంలో ఏకత్వం పాటిస్తూ'' అని చెబుతుండగా కమలాకర్ కలుగజేసుకుంటూ ''అసలు విషయం చర్చించండి సార్!'' అన్నాడు.

ఇక చేసేది లేక సెక్రటరీ బాబూరావు ''చూడండి! రేపు సంక్రాంతి ముగ్గుల విషయంలో అందరూ సంయమనం పాటించాలి, వారి వారి గుమ్మాల ముందు మాత్రమే ముగ్గులు వేసుకోవాలి. అవతల వాళ్లకు నడవటానికి దారి వదలాలి. పోయిన సంక్రాంతికి పాపం మన




కమలాకర్‌గారు ముగ్గు దాటబోయి జారిపడి నెల రోజులు హాస్పిటల్‌లో ఉన్న సంగతి మనందరికీ తెలుసు. మన అసోసియేషన్ తరుపున మనమందరమూ వెళ్ళి ఆయనకు బొకేలు ఇచ్చి త్వరగా కోలుకోవాలని విషెస్ చెప్పి వచ్చాము. మనవంతు బాధ్యతగా ఆ నెల మెయింటనెన్స్ కూడా ఆయన్ని అడగలేదు'' అంటుండగా కమలాకర్ ''సార్ బాబూరావుగారు! అవన్నీ ఇప్పుడు అవసరమా? అసలు విషయానికి రండి, సరే! నేనే మొదలుపెడతాను. చూడండి! నా ఫ్లాట్ చివరిగా ఉంది, ఉన్నది ఒకటే దారి, ముఖ్యంగా పండుగ రోజుల్లో ముగ్గులు తొక్కకుండా పోవడం చాలా ఇబ్బందిగా ఉంది, కనుక నాదొక ప్రపోజల్ కం రిక్వెస్ట్ అదేమంటే- మాది ఫస్టు ఫ్లోర్ కాబట్టి మా వాకిలి ప్రక్కనుండి క్రిందకు మెట్లు ఏర్పాటు చేస్తే బావుంటుందని నా అభిప్రాయం, ఖర్చు నేనే భరిస్తాను'' అన్నాడు.

వెంటనే సెక్రటరీ అందుకొని ''భలేవారు సార్

## హృతికా మజాకా!!

**'జోధా అక్బర్' షూటింగ్‌కి హాజరయ్యేందుకు గాను హృతిక్ ఏకంగా ఓ చిన్నపాటి విమానాన్నే అద్దెకు తీసుకున్నాడట. ఇందుకుగాను అతనికి 60 లక్షలు ఖర్చయితే దాన్ని తన జేబు నుంచే చెల్లించాట్ట. ఇలా ఎయిర్‌క్రాఫ్ట్‌లో వెళ్లడం వల్ల ముంబాయి నుంచి 100 కిలోమీటర్ల దూరంలో వేసిన సెట్స్‌కి వెళ్లేందుకు కేవలం ఇరవై నిమిషాలే పట్టేదిట. దాదాపు రోజుకి మూడు గంటల టైము కలిసొచ్చేందుకు ఇలా ఖర్చు చేసాట్ట. దాన్ని నిర్మాతపై రుద్దకుండా తన జేబులోంచే హృతిక్ ఇవ్వడం గొప్పే విషయమే మరి!**

మీరు! అదెలా కుదురుతుంది? మీ ఫ్లాట్ నుండి క్రిందకు మెట్లు పెడితే అవి సరిగ్గా నరసింహ యాదవ్‌గారి కారు పార్కింగ్‌లో లాండ్ అవుతాయి. మీకు తెలిసే ఉంటుంది ఆయన మాటలతో ఏదీ చెప్పడని, ఇవాళ ఆయన మీటింగ్‌కి రాలేదు కాబట్టి సరిపో యింది. సరే! నేనొక నిర్ణయానికి వచ్చాను. ఇపుడు మీటింగ్ అవగానే స్వయంగా వచ్చి కొన్ని సెన్సిటివ్ ఏరియాలలో ముగ్గుల కోసం మార్కింగ్ చేస్తా, దాని ప్రకారం ముగ్గులు వేసుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదు'' అని ముగించాడు.




అందరూ ఎవరి ఫ్లాట్స్‌లోకి వాళ్లు వెళు తుండగా సెక్రటరీ ఒక టేపు తీసుకొని వాచ్ మాన్‌ని వెంటబెట్టుకొని మీనాక్షి రాజ్యలక్ష్మిల వెనుకనే వచ్చాడు. ''ఏమిటి సెక్రటరీగారు మా వెంట వస్తు న్నారు? సెన్సిటివ్ ఏరియా అంటే మాదేనా?'' అడి గింది మీనాక్షి.

''అబ్బే! అదేం లేదమ్మా! మీది ఫస్టు ఫ్లోర్ కదా మీ దగ్గరనుండి మొదలుపెడితే వాలుగా ఉంటుందని'' అన్నాడు.

ఇద్దరి మధ్య ఉన్న ఆరు అడుగుల స్థలాన్ని చెరి రెండున్నర అడుగులుగా కేటాయించి మధ్యలో ఒక అడుగు మాత్రం కమలాకర్ వాళ్లు నడవడానికి వదు లుతూ పక్కాగా మార్కింగ్ చేసి తను వెంట తెచ్చిన ఎరుపు రంగు కూడా వాచ్ మాన్ చేత వేయించేసాడు.

''ఈ గీతల ప్రకారం మీరు ముగ్గులు వేసుకొని భవిష్యత్తులో ఎవరికీ ఇబ్బంది కలుగకుండా ఉంటూ అసోసియేషన్‌కి సహకరించవలసిన దిగా కోరుతున్నాను, హేపీ సంక్రాంతి'' అంటూ వెళ్ళిపో యాడు.

★ ★ ★

రామారావు భార్యతో ''రాజ్యం ఇలారా! కూర్చో'' అన్నాడు. ఆమె రాగానే ''మన చందుకు చక్కటి సంబంధం ఉన్నదని చాలా రోజులనుండి అనుకుంటు న్నానని సమయం వచ్చినప్పుడు చెబుతానని అన్నాను గుర్తుందా?'' అడిగాడు.

''ఆ! అవును అన్నారు, సస్పెన్స్‌లో పెట్టి ఊరి స్తూనే ఉన్నారుగా!''

''ఇప్పుడా మ్యాచి చూడటానికి వెళుతు న్నాను, నీవు చందు అరగంటలో తయారవ్వాలి'' అన్నాడు.

రాజ్యలక్ష్మి ముఖం వెలిగిపోయింది ''ఎవరండి ఆ అమ్మాయి? చెప్పరూ?'' ఉత్సాహంగా అడి గింది.

''తొందరెందుకు? వెళుతున్నాంగా! మనవాడి ఉద్యోగం ఖాయం అయింది కాబట్టి వాడు ఉద్యోగంలో చేరటం పెళ్ళి చేసెయ్యటం ఈ ఎండాకాలంలోనే జరిగిపోవాలి''

అందరూ తయారై బయటకు వచ్చారు రాజ్యలక్ష్మి ఫ్లాట్‌కి తాళం వేసింది. రామా రావు ఎదుటి తలుపు కొట్టాడు. ''అదే మిటి? మధ్యలో వాళ్ళనెందుకు పిలుస్తు న్నారు?'' అన్నది.

అంతలో ఈశ్వరరావు తలుపు తీసి ''రండి రండి!'' అని లోపలికి ఆహ్వానిం చాడు.

'ఇదేమిటి? వీళ్ళంతా ఇక్కడకు వచ్చారు' అన్నట్లు చూస్తూ మీనాక్షి సంశ యంగా భర్త చెవిలో ''మన స్వాతిని చూడ టానికి వస్తున్నారన్నది చందూవాళ్ళా?'' అని అడి గింది. అవునన్నట్లు తలూపాడు ఈశ్వరరావు. రాజ్యల క్ష్మికి విషయం అర్థమయింది. ఇద్దరు గృహిణులు సంభ్ర మాశ్చర్యాల నుండి తేరుకోవడానికి కొంత సమయం పట్టింది. అందరూ కూర్చున్నారు. చందు స్వాతి ఒకరి వంక ఒకరు చూసుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వు కుంటున్నారు.

రామారావు అందరివైపూ చూస్తూ ''ఇంతకీ ఈ సంబంధం అందరికీ ఇష్టమేనా?'' అని అడిగాడు.

అందరి ముఖాలు అప్పటికే దేదీప్యమానంగా వెలిగి పోతున్నాయి. ''వెరీగుడ్! మరొక ఫ్లాష్ న్యూస్ చెబుతు న్నాను వినండి! పెళ్లి తర్వాత మన రెండు కుటుంబాలు ఉండటానికి మాదాపూర్‌లో రెండు ఎదురెదురు ఫ్లాట్స్ బుక్ చేసాం'' అన్నాడు ఈశ్వరరావు భుజంమీద చెయ్యి వేస్తూ ''అయితే ఇవన్నీ జరగాలంటే ఒక కండీషన్'' అన్నాడు ఈశ్వరరావు.

రావమారావుతో పాటు అందరూ అదేమిటా అని కాస్త గాబరాగా చూసారు ''అదేమంటే అక్కడ కూడా మీరిద్దరు గృహిణులు మీ రోజువారి సరదా గొడవలు కంటిన్యూ చెయ్యాల్సిందే'' అన్నాడు అందరి నవ్వుల మధ్య.

మరుసటి ఉదయం సంక్రాంతికి రెండు ఫ్లాట్స్ మధ్య ఒకే ఒక రంగురంగుల ముగ్గు ప్రత్యక్షమయింది. అది వేసిన కాబోయే వియ్య పురాళ్లు చెరొకవైపు ఎవరెస్టు శిఖరం ఎక్కిన విజేతల్లా నిల బడగా ప్రక్క ఫ్లాట్ కమలా కర్ మాత్రం నోటిమీద వేలు వేసుకొని ఏదో ఆలోచిస్తు న్నాడు.

☆

## ఇదో ట్రెండ్!

**ఇటీవల వచ్చిన 'చక్ దే ఇండియా'లో హాకీ కోచ్‌గా నటించాడు షారుఖ్ ఖాన్. రాబోయే 'గోల్' సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా నటిస్తున్నాడు జాన్ అబ్రహాం. ఇపుడు మరో హీరో మరో ఆట ప్రధా నాంశంగా తయారయ్యే సినిమాలో నటిస్తున్నాడు. కేరమ్స్ ఆట ఇతివృత్తంగా సాగే 'స్ట్రయికర్' సిని మాలో సిద్ధార్థ నటించబోతున్నాడని బాలీవుడ్ సమా చారం. దీనికి గ్రౌండ్ వర్క్ అంటే కేరమ్ ఆట బాగా ప్రాక్టీసు చేయడం దానికి సంబంధించిన మరిన్ని వివ రాల సేకరణ లాంటి వాటితో సిద్ధార్థ బిజీగా వున్నాట్ట.**

